శభాష్ పోలీస్

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది వృద్ధులకు, అంగవైకల్యం కలిగిన ఓటర్లకు తన వంతు సహాయ సహకారం అందించారు. పశ్చిమ నియోజకవర్గంలో 47,48,49,50 పోలింగ్ బూత్‌లలో ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న, ఓటర్లు ఎండ తీవ్రతతో ఉక్కుపోత సైతం లెక్కచేయకుండా ఓట్లు వేయడానికి బారులు తీరిన జనం ఓటు వేసి అనంతరం వికలాంగులను వీల్ చైర్‌పై కూర్చుని పెట్టి తీసుకు వస్తు ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందించారు.

ప్రశాంతంగా పోలింగ్

కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎంలు పోటెత్తిన ఓటర్లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఓట్ల పండగకు ఓటర్ల తరలివచ్చారు. విశాఖలో ఉదయం ఏడు గంటలకే ప్రారంభమైన పోలింగ్ కొన్నిచోట్ల ఈవీఎం యంత్రాలు మొరాయించాయి. ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్ మందుకొడిగానే సాగింది. ఎండలు కారణంగా అనేకమంది క్యూలో ఉండడానికి ఇష్టం లేక అనేకమంది ఓటర్లు ఓటు వేయడానికి ఆసక్తి చెప్పకపోవడంతో పోలింగ్ శాతం తగ్గింది. కొన్నిచోట్ల ఎండను సైతం లెక్కచేయకుండా ఓటర్లు తరలివచ్చారు. అనేక పోలింగ్ కేంద్రాల వద్దకు వృద్ధులు, వికలాంగులు ఉత్సాహంగా సహాయకుల సహకారంతో తరలివచ్చారు. అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని ఆయా నియోజకవర్గాల్లో పరిశీలించారు. కొన్నిచోట్ల వైసిపి, టిడిపి కార్యకర్తలు ఓటర్లను ప్రభావితం చేసే విధంగా పోలింగ్ కేంద్రాలకు దగ్గరలోనే ప్రచారం నిర్వహించడం చేశారు. ఓటర్లు అత్యధిక శాతం సాయంత్రమే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. సాయంత్రం 6 గంటలకు క్యూలైన్లో ఉన్నవారు 7 గంటల వరకు ఓటేశారు. మరొక్క రాత్రి 8 గంటల సమయంలో నగరంలో కురిసిన భారీ వర్షానికి ఎన్నికల సామాగ్రి తరలించడం అధికారులకు కష్టతరంగా మారింది.

విశాఖ తూర్పులో ఓటు వేసిన బి.వి.రామ్



విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తన ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గం పరిధిలోని వెంకోజీ పాలెంలోని జీవీఎంసీ ఎలిమెంటరీ పాఠశాలలో పోలింగ్ బూత్ నెంబర్ 21/273లో ఓటు వేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ నగరవ్యాప్తంగా ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకుంటున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ క్యూ లైన్‌లలో నిలబడి మరీ తమ రాజ్యాంగ హక్కును సద్వినియోగించుకున్నారు.

ఓటు వేసిన ప్రముఖులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటలకే ప్రారంభమైంది. ప్రముఖులు అంతా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. చినవాల్తేరులోని కొటక్ సెలేసియన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 175వ నెంబరు పోలింగ్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున ఓటు హక్కు వినియో గించుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ కుటుంబ సభ్యులతో తూర్పు నియోజకవర్గంలో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల 210వ పోలింగ్ బూత్‌లో, ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్‌లో గల 183వ పోలింగ్ బూత్‌లో జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సతీమణితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ.రవిశంకర్ అయ్యర్ జి.వి.ఎం.సి, వాల్తేర్-02, ప్రైమరీ స్కూల్ చిన్న వాల్తేర్‌లో గల పోలింగ్ బూత్ వద్ద ఓటు వేశారు. రాజ్యసభ సభ్యులు వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి మధురవాడలో గల మల్లయ్య పాలెం అంబేద్కర్ విగ్రహం దగ్గర సైక్లోన్ షెల్టర్ 331 పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గాజువాక నియోజవర్గం వైసీపీ అభ్యర్థి మంత్రి గుడివాడ అమర్నాథ్ కుటుంబ సమేతంగా తన సొంత గ్రామమైన మింది జడ్పీ హై స్కూల్‌లో కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. భీమిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు దంపతులు తూర్పు నియోజకవర్గం ఎం.వి.పి. కాలనీ సెక్టార్ - 4లోని సెవెంత్ డే అడ్వెంటిస్ట్ స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకునున్నారు. సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, భీమిలి నియోజకవర్గంలో పి. ఎం. పాలెం 268 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి దంపతులు విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలో పోలింగ్ కేంద్రం 100లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు భీమిలి శాసనసభ నియోజకవర్గం మధురవాడ పోలింగ్ బూత్ నెంబరు 329లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తూర్పు శాసనసభ నియోజకవర్గం ఆరిలోవలో పోలింగ్ కేంద్రం 22లో విశాఖ పశ్చిమ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల ఓటు వేశారు. దక్షిణ నియోజకవర్గంలో రెల్లి వీధి అంబేద్కర్ కల్యాణ మండపంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, భర్త శ్రీనివాస్, కుటుంబ సభ్యులు ఆరిలోవలోని తోటగరువు హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం 52లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ క్యాంపస్ లో 221వ బూత్‌లో ఉదయం 7 గం.లకు ఈవీయం సక్రమంగా పనిచేయకపోవడంతో మరల జేడి లక్ష్మీనారాయణ తన సతీమణి ఊర్మిళతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలో వైసీపీ అభ్యర్థి అడారి ఆనంద్ మర్రిపాలెం రైల్వే పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు సీతమ్మధార మారుతి నగర్, పాప హెూం వెనుక గల 176 పోలింగ్ బూత్ వద్ద ఓటు తమ ఓటును వినియోగించుకున్నారు. శివాజీపాలెం ఆంధ్రా యూనివర్సిటీ మహిళా క్యాంపస్‌లో దక్షిణ నియోజకవర్గం కూటమి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, భార్య పద్మజ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశాఖ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ ఆయన సతీమణి తేజశ్వినితో కలిసి రాంనగర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. గాజువాక ఎలిమెంటరీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రంలో కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు తన భార్యతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. భీమిలిలో వైసిపి భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.



ఉత్సాహంగా పోలింగ్

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తిలో ఉత్సాహంగా పోలింగ్ నమోదైంది. ఉదయం నుండి వందలాది మంది ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు ఎన్నికల సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీని ప్రజలు ఉతికి ఆరేసారని ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి గొర్లె రామునాయుడు, టిడిపి నాయకులు వేగి పరమేశ్వరరావు, జనసేన నాయకులు గొర్లె అప్పారావు తదితరులు పాల్గొన్నారు. రాంపురంలో స్థానిక ఎమ్మెల్యే, అధికార పార్టీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్ రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు మెంట్ మహేష్ తదితరులు ఉన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి సరిపల్లెలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. చినముషిడివాడ శాంతినగర్ లో మరో స్వతంత్ర అభ్యర్థి వడ్డాది ఉదయ్ కుమార్ ఓటు వేశారు.

భీమిలి: భీమిలి మండలంలో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ ప్రారంభం నుండే ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. కొన్ని చోట్ల ప్రారంభంలో ఈవీఎంలో సాంకేతిక లోపాలతో పోలింగ్ మందకొడిగా సాగింది. పెద్ద చేపలుప్పా డలో 1500 మంది ఓటర్లకి ఒకే బూత్ కేటాయించడంతో ఓటర్లు నానా ఇబ్బందులు పడ్డారు. చాలాచోట్ల భద్రతా సిబ్బంది కొరత స్పష్టంగా కనిపించింది. రెండు గంటల్లో 7.91 శాతంగా పోలింగ్ నమోదయింది. మరుసటి రెండు గంటల్లో 21 శాతానికి పెరిగింది.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలో ఏడువార్డులు లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 7:30 నుండి మొదలైన పోలింగ్ మొదట్లో నిదానంగా వెళ్లిన సాయంత్రానికి ఊపందుకుంది. మల్కాపురం శ్రీహరిపురం, ములగాడ సింధియా తదితర ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ బూత్‌ల వద్ద ప్రజలు ఓట్లు వేశారు.

పెదగంట్యాడ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎటువంటి అవాంతరములు లేకుండా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పెదగంట్యాడలో గల పోలింగ్ బూత్‌లలో సాయంత్రం 6 గంటలకు 80 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓట్లు 20000లు కాగా 16000 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల సంఘం వారు ప్రజలకు ఎటువంటి అసౌకార్యం కలగకుండా టెంట్‌లు, తాగునీరు, మందులు అందుబాటులో ఉంచారు.

ఓటు హక్కు వినియోగించుకున్న పల్లా

విశాలాంధ్ర - గాజువాక: మాజీ శాసనసభ్యులు గాజువాక ఉమ్మడి కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా హైస్కూల్ రోడ్లో గల జిల్లా పరిషత్ ప్రాథమిక స్కూల్లో కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం ఎక్కడ చూసినా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి భారీగా తరలివచ్చారన్నారు. యువతీ యువకుల సంఖ్య కూడా అధికంగా ఉండడంతో రాష్ట్రంలో మార్పు రావాలి బాబు కావాలి ఉద్యోగం రావాలి అన్న ఉద్దేశంతోనే ఓటర్లు ముందుకొచ్చి తమ ఓటు హక్కుని వినియోగించుకుంటున్నారని అన్నారు. గెలుపుపై ఈరోజు జరగబోయే ఎలక్షన్ పోలింగ్ శాతమే నిదర్శనం అన్నారు.

దక్షిణలో మందకొడిగా పోలింగ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నగరంలోని దక్షిణ నియోజకవర్గంలో పలు చోట్ల పోలింగ్ మందకొడిగా సాగింది. ఓటర్లు తెల్లవారుజాము నుంచే బారులు తీరినప్పటికీ ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడం, కొన్నిచోట్ల ఈవీఎంలు మోరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఏ.మల్లికార్జున దక్షిణ నియోజక వర్గంలో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల ప్రక్రియను చూసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఒక ఈవీయంలో 700, మరో ఈవీయంలో 1500 ఇలా ఓట్లు ఒక్కో దాంట్లో ఒకో విధంగా ఉండడం వివిప్యాట్ స్లిప్‌లు కూడా స్లోగా బయటికి రావటంతో నెమ్మదిగా ఓటింగ్ ప్రక్రియ జరిగింది. క్యూ లైన్‌లో ఉన్నవారు చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. మధ్యాహ్నం భోజనం తర్వాత ఓటింగ్ ప్రక్రియ కాస్త జోరందుకుంది. చాలా చోట్ల యువత ఓట్ వేయడానికి ఉత్సాహం చూపించారు. మొదటిసారి ఓటు వేసిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. ఒంటిగంట సమయానికి దక్షిణలో 31 శాతం ఓట్లు నమోదు అయ్యాయి. మూడు గంటలకు 41 శాతం ఐదు గంటలకు 53.30 శాతం ఓట్లు నమోదు అయినట్లు తెలుస్తుంది. సాయంత్రం 6 గంటలకు భారీగానే ఓటర్లు లైన్‌లో ఉన్నారు. నియోజకవర్గంలో ఏ పోలింగ్ బూత్ వద్ద చూసినా హడావిడి కనిపించింది. పండుగ వాతావరణం లాగా యువకులు వాహనాలతో తిరుగుతూ హల్చల్ చేశారు.



మందకొడిగా పోలింగ్ : మొరాయించిన ఈవీఎంలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని 26 పంచాయతీల్లో 51,354ఓటర్ల గాను 57 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ నిర్వహించగా ఉదయం 7 గంటలకు ప్రారంభం కావలసిన పోలింగ్ కొన్నిచోట్ల 9 గంటల వరకు ప్రారంభం కాకపోవడంతో ఓటర్లు బారులు తీరి అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని బంటుపల్లి వారి కల్లాలు వేములవలస వలు కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించడంతో గంటపాటు ఆలస్యంగా ప్రారంభమైంది. ఎండల సైతం లెక్కచేయకుండా ఓటర్లు బార్లు తీరారు. కొన్నిచోట్ల తూతూ మంత్రంగా టెంట్లు ఏర్పాటు చేసిన ఎండ తీవ్రతను బట్టి మరలా సిబ్బంది అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టి టెంట్లు ఏర్పాటు చేశారు.

ఓటర్లకు తప్పని తిప్పలు

మందకోడిగా సాగిన పోలింగ్

మండలంలోని 51354 మంది ఓటర్లకు గాను ఉదయం తొమ్మిది గంటలకు 9 శాతం, 11 గంటలకు 23%, ఒంటిగంటకు 38 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 54% ఓట్ల పోలవడంతో దాదాపుగా సగం మంది లైన్‌లోనే ఎదురు చూడవలసిన పరిస్థితి నెలకొంది. ఈవీఎంలలో ఓటర్లు, వృద్ధులు వికలాంగులు అవగాహన లోపంతో ఓటు వేయడానికి సమయం ఎక్కువ తీసుకుంటున్నారని పోలింగ్ సిబ్బంది పేర్కొంటున్నారు. సాయంత్రం 5 గంటల నుండి ఓటర్ లు భారీ లైన్ల కట్టడంతో భద్రత సిబ్బంది సరేనా చర్యలు చేపట్టకపోవడంతో కొంతమంది ఓ టర్లు వెనుదిరిగి పోయారు.

గొట్టివల్లి పోలింగ్ కేంద్రంలో మహిళలు నిరసన

గొట్టువల్లి పంచాయతీలో గత ఎన్నికలలో నాలుగు కేంద్రాల ద్వారా పోలింగ్ నిర్వహించగా ప్రస్తుతం రెండు కేంద్రాలు ద్వారానే పోలింగ్ నిర్వహించడంపై తీవ్ర జాప్యం జరిగిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతలు వలన ఓటర్లు మధ్యాహ్నం టైం పెద్దగా ఆసక్తి చూపలేదు అలాగే నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బంది కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులక గురయ్యారు

1000 ఓటర్‌లు దాటిన పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు సాయంత్రం వరకు బార్లు తీరడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. రాత్రి 8:00 కావస్తున్న ఇంకా పూర్తి మేర పోలింగ్ మందకొడిగా సాగింది. ఓటర్లు ఓటు వేయడానికి క్యూ లైన్ లో బారులు తీరారు.

విశాఖలో పోలింగ్ దృశ్యమాలిక

మార్పు కోసం నేను సైతం

విశాలాంధ్ర - గాజువాక: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్లలో ప్రజలు, కార్మిక వర్గం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెరిగిన ధరలు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థల ప్రైవేటీకరణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ అయిన విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ప్రయత్నాలు, దళితులు, బడుగు, బలహీన వర్గాలపై నిత్యం ఏదో ఒక చోట దాడులు, అత్యాచారాలు ఎక్కువయ్యాయి. వీటన్నిటికీ ముగింపు పలకాలని దేశంలో ఇండియా కూటమి ఏర్పడింది. సోమవారం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో నేను సైతం ఇండియా కూటమి విజయం కోసం నా ఓటు హక్కును వినియోగించుకున్నాను.

- జి.ఆనంద్, ఉక్కు ఉద్యోగి, సీపీఐ నేత

ఎన్నికలలో ఎన్ని సిత్రాలో...

- ఓటు హక్కు ను సద్వినియోగం చేసుకున్న ప్రజలు

విశాలాంధ్ర - చోడవరం: సార్వత్రిక ఎన్నికల్లో యువత, సీనియర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండలంలోని గవరవరం గ్రామానికి చెందిన కొమ్మనమంచి వెంకట రమణయ్య పంతులు(103) తో సైతం ఈ ఏడాది ఓటు కలిగిన యువత ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంచంపై వుండి రాలేని వికలాంగులు సైతం మరొకరి సహాయంతో స్వచ్ఛంగా తమ ఓటు హక్కును పొందారు.

ప్రశాంతంగా ఎన్నికలు

విశాలాంధ్ర - ఎలమంచిలి రూరల్: ఎలమంచిలి నియోజకవర్గంలో అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు వినియోగించుకునేందుకు బారులు తీరారు. వృద్ధులు మహిళా ఓటర్లు అత్యధికంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు నియోజకవర్గంలోని 246 పోలింగ్ స్టేషన్లో 2,06,340 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా సాయంత్రం 6 గంటల సమయానికి 67% ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 6 గంటల సమయానికి లైన్ లో వేచి ఉన్న కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు ఓటింగ్ కొనసాగింది. ఎలమంచిలి మండలంలో67, రాంబిల్లి మండలంలో 51, అచ్యుతాపురం 51, మునగపాక 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆయా మండలాల్లో అధికంగా మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - గాజువాక: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ సోమవారం గాజువాక నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగింది. ఈ పోలింగ్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక మిండి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వీరు ఓటు వేశారు. మంత్రి అమర్నాథ్ తో పాటు, ఆయన పెదనాన్న, పార్టీ సీనియర్ నాయకులు గుడివాడ అప్పల రామ్మూర్తి, అమర్నాథ్ సతీమణి హిమ గౌరి, తల్లి గుడివాడ నాగమణి, సోదరి సురేఖ, 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష లతీష్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం అమర్నాథ్ నియోజకవర్గ మొత్తం పర్యటించి ఆయా పోలింగ్ బూత్ లలో జరుగుతున్న ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ ప్రారంభమైన కేవలం రెండు గంటల్లోనే గాజువాక నియోజకవర్గం లో 17 శాతానికి పైగా జరగటం గమనార్హం.

జగన్మోహన్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కాబోతున్నారు

ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం అమర్నాథ్ మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి కనిపిస్తున్నారని, ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పోలింగ్లో పాల్గొంటున్నారని చెప్పారు. గడిచిన ఐదు సంవత్సరాలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాల వలన లబ్ధి పొందిన మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేయడానికి ముందుకు వచ్చారని, మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని అమర్నాథ్ వెల్లడించారు.

తూర్పులో గంటల తరబడి నిరీక్షణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని తూర్పు నియోజకవర్గంలో సిబ్బంది నిర్లక్ష్యం ఓటర్లకు శాపంగా మారింది. ఉదయం అనగా వెళ్లిన వారు మధ్యాహ్నంకి గాని బయటపడలేదు. నాలుగైదు గంటల పాటు నిలబడి ఓటు వేసి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వృద్ధులు నిలబడలేక ఇబ్బంది పడ్డారు. కూర్చునే సౌకర్యం కూడా లేకపోవడంతో కిందనే చతికిల పడ్డారు. ఒక్కో బూతులో సామర్థ్యానికి మించి ఓట్లు ఉండడం వల్ల ఓటింగ్ మందకొడిగా సాగింది. ఓటర్లు తెల్లవారుజాము నుంచే బారులు తీరినప్పటికీ ఈవీఎంలు నెమ్మదిగా పనిచేయడంతో ఓటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. పోలింగ్ కేంద్రాల్లో ఒక ఈవీయంలో 700, మరో ఈవీయంలో 1300, 1500 ఇలా ఓట్లు ఒక్కో దాంట్లో ఒకో విధంగా ఉండడం వివిప్యాట్ స్లిప్ లు కూడా నెమ్మదిగా బయటికి రావటంతో ఓటింగ్ ప్రక్రియ చాలా ఆలస్యం అయ్యింది. క్యూ లైన్ లో ఉన్నవారు చాలాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. చాలామంది భోజనానికి కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత ఓటర్లు భారీగా కోడింగ్ బూతులకు చేరుకున్నారు. చాలా చోట్ల యువత ఓట్ వేయడానికి ఉత్సాహం చూపించారు .మొదటిసారి ఓటు వేసిన వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకి 50 శాతం ఓటింగ్ జరగ్గా సాయంత్రం 5 గంటలకు 60.50 పోలింగ్ జరిగింది. 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసేసరికి ఓటర్లు భారీగా లైన్‌లో వేచి వున్నారు. రాత్రి పది గంటల వరకు ఓటింగ్ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్
డా. ఎ. మల్లికార్జున
ఓటుహక్కును వినియోగించుకున్న అధికారులు,
రాజకీయ ప్రముఖులు
ఉత్సాహం చూపిన ఓటర్లు...
సాయంత్రం 5.00 గంటల వరకు 59.39 శాతం
పోలింగ్ నమోదు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 7 గంటలకు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. అక్కడక్కడా ఈవిఎంల్లో స్వల్ప అవాంతరాలు తలెత్తగా, వెంటనే అధికారులు స్పందించి సరిచేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1991 పోలింగ్ కేంద్రాల్లో తొలుత పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనప్పటికీ, ఆ తరువాత జోరందుకుంది. ఉదయం 6.00 గంటల ఉంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున ఆదేశాల మేరకు ఉదయం 5.30 గంటలకే చాలా పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఎండను దృష్టిలో ఉంచుకొని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు వేశారు. తాగునీరు, బయో టాయిలెట్లు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పలు చోట్ల అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నపిల్లల సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం 1,000 వీల్ ఛైర్లు అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల్లోకి చేరుకోవడానికి ర్యాంపులు కూడా ఉండటంతో దివ్యాంగులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ కలగలేదు. అంధుల కోసం అభ్యర్థుల జాబితాలను బ్రెయిలీ లిపిలో పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచటం విశేషం. జిల్లాలోని మొత్తం 11 మోడల్ పోలింగ్ కేంద్రాల్లో మరిన్ని అదనపు హంగులు ఏర్పాటు చేశారు.

కంట్రోల్ రూమ్ నుంచి కలెక్టర్ పర్యవేక్షణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ ప్రక్రియను రోజంతా పర్యవేక్షించారు. ఉదయం 5.00 గంటలకే కలెక్టరేట్ కు చేరుకున్న ఆయన కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. డ్యాష్ బోర్డు ద్వారా పోలింగ్ కేంద్రాలను చూశారు. అప్పటి నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా, ఆర్‌ఓల ద్వారా పోలింగ్ బూత్‌ల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వచ్చారు. అవసరమైన మేరకు ఆదేశాలను జారీ చేసి పోలింగ్ సిబ్బందిని నడిపించారు. ఉదయం నిర్ణీత సమయానికి మాక్ పోల్ పూర్తి చేసే విధంగా పోలింగ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఈవీఎంల్లో సమస్యలు తలెత్తిన చోట, వెంటనే సంబంధిత అధికారులను హెచ్చరించి, వాటిని సరిచేసి, పోలింగ్ కొనసాగే విధంగా చర్యలు తీసుకున్నారు. క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై మరింత దృష్టి సారించారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ సమష్టిగా నడిపించారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పరిశీలకులు

ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్, వ్యయ పరిశీలకులు రెంగ రాజన్, ఇతర నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు అక్తా జైన్, సౌమ్య పాండే జైన్ సోమవారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. పోలింగ్ తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. మైక్రో అబ్జర్వర్ల ద్వారా పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆయా నియోజకవర్గాల పరిస్థితిని దగ్గరగా పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు తగిన సూచనలు చేశారు.

పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు..
ఉత్సాహం చూపిన ఓటర్లు

జిల్లాలో సాధారణ ఓటర్లతో పాటు అధికారులు, రాజకీయ ప్రముఖులు ఉత్సాహం చూపారు. ఉదయం నిర్ణీత సమయానికి మొదలైన పోలింగ్ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. సాయంత్రం 6.00 గంటలకే పోలింగ్ సమయం ముగిసినప్పటికీ చాలా మంది పోలింగ్ కేంద్రాల బయట క్యూలైన్లలో బారులు తీరారు. దీన్ని గమనించిన అధికారులు తక్షణ చర్యలు తీసుకున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున నిర్వహించిన ఓటర్ చైతన్య కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయి. సోమవారం ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. గంటల పాటు వేచి ఉండి మరీ.. తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార యంత్రాంగం కూడా ఆయా పోలింగ్ కేంద్రాల తగిన ఏర్పాట్లు చేశారు. ఓటర్లు సులభంగా అర్థమయ్యేలా అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాలను గోడలపై అతికించారు. ఎన్.ఎస్.ఎస్., ఎన్.సి.సి., రెడ్ క్రాస్ లాంటి సంస్థల నుంచి వాలంటీర్లను ఎన్నికల ప్రక్రియలో వినియోగించి ఓటర్లు సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పోలింగ్ ప్రక్రియను పరిశీలించి కలెక్టర్ తీసుకున్న నిర్ణయాలు ఫలించాయి. జిల్లాలో గతం కంటే పోలింగ్ శాతం పెరగడానికి దోహదం చేశాయి. ఉదయం 7.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సాగిన ప్రక్రియలో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 59.39 శాతం పోలింగ్ నమోదయ్యింది. సాయంత్రం 6.00 గంటలకు క్యూ లైన్లలో వేచి ఉన్న ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాటు చేయటంతో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.